ప్రజాశక్తి

బుధవారం 14 జూన్ 2023
5
అల్లూరి సీతారామరాజు

గిరిజన గురుకుల కళాశాలల్లో సీట్లు పెంచాలి

ప్రజాశక్తి -పాడేరు :పాడేరు ఏజెన్సీలోని గిరిజన గురుకుల కళాశాలల్లో సీట్ల సంఖ్య పెంచాలని, దరఖాస్తు చేసుకున్న విద్యార్థులందరికి ప్రవేశం కల్పించాలని ఏపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్.ధర్మన్న పడాల్, పి.బాలదేవ్ అధికారులను కోరారు మొదటి కౌన్సిలింగ్‌లో 3021 మంది దరఖాస్తు చేసుకోగా కేవలం 1290 మందికి మాత్రమే సీట్లు కేటాయించారని, ఇందులో బాలికలు 1660 మంది దరఖాస్తు చేసుకోగా 450 సీట్లు మాత్రమే కేటాయించారన్నారు. . ఇంకా సీట్ల కోసం దరఖాస్తు చేసుకుని మిగిలిపోయిన 1210 మంది విద్యార్థులకు ప్రవేశం కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే బాలురకు సంబంధించి 1361 మంది దరఖాస్తు చేసుకోగా 840 మందికి మాత్రమే సీటు కేటాయించారని, మిగిలిన 521 మందికి సీట్లు కేటాయించాల్సి ఉందన్నారు.వెంటనే రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహించి, అందరికి సీట్లు కేటాయించాలని కోరారు. బాలికలకు కొత్తగా ఒక గిరిజన గురుకుల కళాశాల ఏర్పాటు చేయాలని, గురుకుల కళాశాలల్లో అధ్యాపకులు, సిబ్బంది, సౌకర్యాల కొరత సమస్యను పరిష్కరించాలని కోరారు.

1671 మంది గిరిజన లబ్ధిదారులకు 2565.81 ఎకరాల భూపంపిణీ

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అమర్‌నాథ్ అధ్యక్షతన అసైన్‌మెంట్ కమిటీ నిర్ణయం

ఆన్‌లైన్ జూమ్ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్

ప్రజాశక్తి -పాడేరు: అల్లూరి జిల్లాలో 1671 మంది లబ్ధిదారులకు 2565.81 ఎకరాల భూమి పంపిణీకి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అధ్యక్షతన ఆన్‌లైన్‌లో నిర్వహించిన అసైన్‌మెంట్ కమిటీ ఆమోదం తెలిపింది. మంగళవారం అసైన్మెంట్ కమిటీ చైర్మన్, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విశాఖపట్నం సర్క్యూట్ హౌస్ నుంచి జూమ్ ద్వారా అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశమై ఈ అంశంపై చర్చించారు. ఈ సమావేశంలో పాడేరు, అరకు, రంపచోడవరం ఎమ్మెల్యేలు కె. భాగ్యలక్ష్మి, చెట్టి ఫల్గుణ, ఎన్. ధనలక్ష్మి, ఎమ్మెల్సీలు, కలెక్టర్ సుమిత్ కుమార్, జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాసు, పాడేరు, రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారులు వి. అభిషేక్, సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్ తదితరులు పాల్గొని నిరుపేద భూములు పంపిణీకి సంబంధించి కార్యాచరణపై నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు అరకు అసెంబ్లీ నియోజకవర్గంలో 550 మంది లబ్ధిదారులకు 777.45 ఎకరాల భూమిని, పాడేరు నియోజకవర్గంలో 561 మందికి 499.53 ఎకరాలను, అలాగే రంపచోడవరం నియోజకవర్గంలో 560 మంది లబ్ధిదారులకు 1288.83 ఎకరాల భూమిని పంపిణీ చేయాలని సమావేశం నిర్ణయించింది. మొత్తం మీద జిల్లాలో 1671 మంది లబ్ధిదారులకు 2565.81 ఎకరాల భూమి పంపిణీకి ఆమోదించింది. ఈ సమావేశంలో తమ నియోజకవర్గాల్లో పలువురు అర్హత కలిగిన గిరిజనులు ఇంకా మిగిలి ఉన్నారని, వారికి కూడా తగిన న్యాయం చేయాలని మంత్రి అమర్‌నాథ్‌కు అల్లూరి జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు విన్నవించగా, మంత్రి అమర్‌నాథ్ సానుకూలంగా స్పందించి, రెండో విడతలో అర్హులైన వారి జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించారు. లబ్ధిదారులకు అతిత్వరలో సీఎం జగన్ చేతులమీదుగా భూమి హక్కు పత్రాలను అందజేస్తామని మంత్రి అమర్ స్పష్టం చేశారు.

అదనపు ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయండి

ఎంపిడిఒకు వినతిపత్రం ఇస్తున్న వైస్ ఎంపిపి, సిపిఎం నేతలు

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు : ఆధార్ నమోదు, సవరణ, అప్‌డేట్‌కు గిరిజనులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి, మండలంలో అదనంగా మరో ఐదు ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని మండల వైస్ ఎంపిపి-1 పి.సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సిపిఎం ఆధ్వర్యంలో ఎంపిడిఒకు వినతిపత్రం అందజేశారు. మండలంలో 23 పంచాయతీలు 14 గ్రామ సచివాలయాల పరిధిలో 375 గ్రామాలున్నాయని, ఆయా గ్రామాల్లో గిరిజనులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలంటే ఆధార్ తప్పనిసరి కావడంతో అవస్థలు పడుతున్నారన్నారు. మండలంలో ఆధార్ కేంద్రాలు తక్కువగా ఉండడం వల్ల ఆధార్ పనులపై వస్తున్న వారంతా రోజంతా పడిగాపులు పడినా, పనులు జరగని స్థితిలో పని జరగకుండానే వెళ్లిపోయే పరిస్థితి ఉందన్నారు. మండలంలో జియో సెల్ టవర్లు అందుబాటులో ఉన్న సచివాలయాల్లో మరో ఐదు ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా గిరిజనుల ఆధార్ కష్టాలకు విముక్తి కల్పించాలని కోరుతున్నారు. ఎపి ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎంఎం శ్రీను పాల్గొన్నారు.

బడి, అంగన్‌వాడీ ఏర్పాటు చేయండి

ఐటిడిఎ పిఒకు సల్దిగడ్డ గ్రామస్తుల మొర

పిఒను కలిసేందుకు వచ్చిన 48మంది చిన్నారులు

ప్రజాశక్తి -పాడేరు: జిల్లా కేంద్రానికి 12 కిలోమీటర్ల దూరంలో ఉన్నప్పటికీ, తమ గ్రామంలో అంగన్వాడీ, బడి వంటి సౌకర్యాలు లేవని పాడేరు మండలం సల్దిగడ్డ గ్రామ పివిటిజి గిరిజనులు ఆవేదన చెందుతున్నారు. తమ గ్రామానికి పాఠశాల, అంగన్వాడీ కేంద్రం మంజూరు చేయాలని కోరుతూ ఐటిడిఎ పిఒకు మొరపెట్టుకునేందుకు తమ గ్రామంలోని అర్హులైన 48 మంది చిన్నారులతో కలిసి పిఒ కార్యాలయానికి వచ్చిరు. తమ గ్రామంలో అంగన్వాడీ కేంద్రం, బడి ఏర్పాటుకు సరిపడా పిల్లలున్నటికీ, వాటి ఏర్పాటు జరగడం లేదని, దీంతో బడికి వెళ్లాలంటే రెండు కిలోమీటర్ల దూరం అడవి మార్గంలో నడిచి వెళ్లాల్సిన దుస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే అంగన్వాడీ కేంద్రం కూడా లేకపోవడంతో పిల్లలు, గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం పౌష్టికాహారం అందడం లేదన్నారు. తమ గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని పిఒకు విన్నవించి, వినతిపత్రం అందించారు.

విద్యార్థులందరికీ విద్యాకానుక కిట్లు అందజేయండి

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: విద్యార్థులందరికీ జగనన్న విద్యాకానుక కిట్లు అందేలా హెచ్ఎంలు చర్యలు చేపట్టాలని ఎంఇఒ ఎం.రామచంద్రరావు సూచించారు. మంగళవారం. మండలంలోని బిల్లాపొట్టు ప్రాధమిక పాఠశాలను సందర్శించారు. పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పేదలకు విద్యాభివృద్ధికి ప్రభుత్వం ఎన్నో పథకాలను ప్రవేశపెడుతోందని, వాటన్నింటినీ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సంబంధిత పాఠశాలల ఉపాధ్యాయుల తమ పరిధిలోని విద్యార్థులకు పథకాలు అందేలా పర్యవేక్షించాలని ఆదేశించారు.

చతికిలబడిన సాగునీటి పథకాలు

కానరాని నిర్వహణ, మరమ్మతులు
రెండేళ్లుగా పైసా విదల్చని ప్రభుత్వం
అరణ్యరోదనగానే గిరిరైతుల ఆవేదన
వర్షాధారమైన సాగుతో అయోమయం

పాడేరులో రూపుకోల్పోయిన చెక్‌డ్యాం

లాడపుట్టు వద్ద ఒకవైపు రక్షణ గోడ లేని కాలువ

ప్రజాశక్తి- పాడేరు: నిర్వహణాలోపం, కనీస మరమ్మతులు, అభివృద్ధి పనులు చేపట్టకపోవడం వల్ల ఏజెన్సీలోని సాగు, తాగునీటి పథకాలు కూనారిల్లుతున్నాయి. శాశ్వత సాగునీటి పథకాలు లేని పరిస్థితుల్లో, కొండవాగులు, గెడ్డలపై ఉన్న చెక్‌డ్యామ్‌లు, నీటి మళ్లింపు మార్గాలపైనే ఆధారపడి వర్షాధారంగా సాగు సాగుతోంది. దీంతో కేవలం వర్షాలు కురిసే ఖరీఫ్ సీజన్‌లోనే ఇక్కడ వ్యవసాయం చేస్తున్నారు. రబీ సీజన్‌కు సాగునీటి ఆధారం లేకపోవడంతో రెండో పంట మన్యంలో దాదాపు గగనమే. ఇటువంటి పరిస్థితుల్లో కొండవాగులు, గెడ్డలపై ఉన్న చెక్‌డ్యామ్‌లను రెండు మూడేళ్లుగా కనీసం నిర్వహణ లేకపోవడం, మరమ్మతులు చేపట్టకపోవడంతో ఆయకట్టుకు సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. దీంతో వచ్చే ఖరీఫ్ సీజన్‌కూ మరోమారు సాగునీటి కష్టాలను ఎదుర్కొనే దుస్థితిలో మన్యం రైతులు దిక్కుతోచని స్థితిలో సతమతమౌతున్నారు.

పాడేరు ఏజెన్సీలోని 11 మండలాల్లో 1566 సాగునీటి పథకాలు ఉన్నాయి. వీటిలో 11 చెరువులు కాగా, మిగిలిన 1,555 చెక్ డ్యాములు ఉన్నాయి. వీటి పరిధిలో ఖరీఫ్ సీజన్‌లోనే 56, 974 ఎకరాల ఆయకట్టుగా వరి సాగవుతోంది. అయితే, మన్యంలోని సాగునీటి వనరులన్నీ ఎక్కువగా కొండవాలులో ఉండే చెక్‌డ్యాంలు, కాలువలు కావడంతో, వర్షాల కురిసే సమయంలో ఆయా సాగునీటి వనరుల్లో నీటి ఉధృతికి ఇవి ధ్వంసమౌతుంటాయి. ఏటా ఇదే పరిస్థితి ఉండగా, వాటిని అప్పటికప్పుడు మరమ్మతులు చేసి, మళ్లీ వినియోగంలోకి తెచ్చుకోవాల్సిన అవసరం ఉంది.

రెండేళ్లుగా కానరాని మరమ్మతులు

ఏజెన్సీలో సాగునీటి పథకాల నిర్వహణ, మరమ్మతులకు రెండేళ్లుగా ప్రభుత్వం ఒక పైసా విదిల్చిన పాపాన పోలేదు. దీంతో ఏజెన్సీలోని పలుచోట్ల సాగునీటి పథకాలు చతికిలపడ్డాయి. పాడేరు జిల్లా కేంద్రంలో స్పెషల్ మైనర్ ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయంతో పాటు పాడేరు, అరకులో రెండు సబ్ డివిజన్ లు ఉన్నాయి. ఇద్దరు డిఇలు, ఎనిమిది మంది జెఇలు, ఇతర సిబ్బంది ఉన్నారు. వీటి పరిధిలో 236 చెక్‌డ్యామ్‌ల మరమ్మతు పనులకు ప్రతిపాదనలు ఉన్నాయి. ప్రభుత్వం నుంచి సాగునీటి పథకాల మరమ్మతు పనులకు ఆమోదం లేక రెండేళ్ల నుంచి ఈ ప్రతిపాదనలు కార్యరూపం దాల్చడం లేదు. ప్రతివారం గిరిజన రైతులు తమ సాగునీటి పథకాల మరమ్మతుల కోసం స్పందనలో అధికారులకు అర్జీలు అందజేస్తూనే ఉన్నారు. వీటికి పరిష్కారం లభించడం లేదు

జి.మాడుగుల మండలంలో మారుమూల గ్రామంలోని చెక్‌డ్యాం

చెక్‌డ్యాం మరమ్మతులకు ప్రతిపాదనలు

గిరిజన రైతుల నుంచి అందిన అర్జీల మేరకు 236 చెక్ డ్యాంలు, పంట కాలువల మరమ్మతులకు ప్రతిపాదనలు చేశాం. ఇటీవల అందిన మరో 20 అర్జీలకు సంబంధించి ప్రతిపాదనలు చేయాల్సి ఉంది. చింతపల్లి మండలం కోటగున్నెలలో చెక్‌డ్యామ్ మరమ్మతులకు రూ, 8.64 లక్షలు, కర్జిపులంక చెక్‌డ్యాం మరమ్మతులకు రూ.2.5 లక్షలు ఐటిడిఎ పిఒ మంజూరు చేశారు త్వరలోనే పనులు చేపడతాం.

ఆర్ నాగేశ్వరరావు, డిఇఇ,
ఎస్ఎంఐ, పాడేరు.

ఉపాధి నిధులతో అరకొరగానే పనులు

2019-20లో జాతీయ ఉపాధి హామీ పథకం కింద 150 సాగునీటి పనులు మంజూరయ్యాయి. వీటిలో సగం పూర్తయ్యాయి. మరికొన్ని నిర్మాణ దశలోనే ఆగిపోయాయి. ఆ తర్వాత కోవిడ్ కారణంగా మళ్లీ రెండేళ్లు నిధులు విడుదల కాని పరిస్థితి ఉంది. దీంతో ఏజెన్సీలో సాగునీటి పథకాల పనులు పూర్తిగా స్తంభించాయి.వీటి గోడు పట్టించుకునే నాధులే లేరు. గతంలో నీరు చెట్టు కార్యక్రమం కింద 2014 నుంచి2018 వరకు కొత్త చెక్ డ్యాంల నిర్మాణం, మరమ్మతు పనులు ప్రభుత్వం నిర్వహించేది. ఎస్ఎంఐ ప్రతిపాదించిన సాగునీటి పనులను జిల్లా కలెక్టర్ నేరుగా ఆమోదించేవారు. తద్వారా పనులు చేపట్టేవారు. నిధులు కూడా ఎస్ఎంఐ శాఖకు ప్రభుత్వం మంజూరు చేసేది. ప్రస్తుతం ఏజెన్సీలో సాగునీటి పథకాలకు సంబంధించి పూర్తిగా ప్రతిష్టంభన నెలకొంది.

జిల్లా కలెక్టర్, పిఒలకు రైతుల విన్నపం...

ఏజెన్సీలోని సాగునీటి కొరత పరిస్థితులపై జిల్లా కలెక్టర్ ఐటిడిఏ ప్రాజెక్ట అధికారి తక్షణమే స్పందించి అవసరమైన చర్యలు తీసుకోవాలని గిరిజన రైతాంగంతోపాటు పలువురు ప్రజాప్రతినిధులు కోరుతున్నారు. పంట కాలువలు, చెక్‌డ్యామ్‌లు మరమ్మతులు జరిపించి సాగునీటి సౌకర్యం మెరుగుపరచుకోవాలని అధికారులను మొర పెట్టుకుంటున్నారు. ఉపాధి హామీ పథకం కింద చెక్‌డ్యాం, పంట కాలువ మరమ్మతు పనులకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు. స్పెషల్ మైనర్ ఇరిగేషన్ శాఖకు ప్రత్యేక నిధులు కేటాయించి గిరిజన ప్రాంతంలో సాగునీటి పథకాల పనులు పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

పెండింగ్‌లో ఉన్న తునికాకు బోనస్ తక్షణమే చెల్లించాలి

సిపిఎం జిల్లా నాయకులు వెంకట్, సీతారామయ్య

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా నాయకులు వెంకట్, పాల్గొన్న కార్మికులు

ప్రజాశక్తి-చింతూరు

చింతూరు డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల్లో తునికాకు కార్మికులకు పెండింగ్‌లో ఉన్న బోనస్‌ను తక్షణమే చెల్లించాలని, ఈ ఏడాది తునికాకు కోసిన కార్మికులకు పేమెంట్స్ తక్షణమే ఇవ్వాలని సిపిఎం జిల్లా నాయకులు పల్లపు వెంకట్, కుంజ సీతారామయ్య డిమాండ్ చేశారు. మండలంలోని బురకనకోట గ్రామంలో మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ 2012 నుండి తునికాకు కార్మికులకు ప్రభుత్వం నుండి బోనస్ డబ్బులు చెల్లించకపోవడం దుర్మార్గమన్నారు. దీనిపై అనేకసార్లు సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన చేసిన ఫలితంగా 2014 నుండి బోనస్ చెల్లిస్తామని చెప్పారని, అవి కూడా ఇంతవరకు చెల్లించలేదని పేర్కొన్నారు. చింతూరు డివిజన్ పరిధిలోని తునికాకు కార్మికులకు రూ.30 కోట్లు ఇవ్వవలసి ఉందన్నారు. ఈ ఏడాది తునికాకు సేకరణ చేసిన చింతూరు, ఏడురాలపల్లి, లక్కవరం యూనిట్లలో కార్మికులకు కట్టకు రూ.3 చొప్పున పేమెంట్లు చేయకుండా అటవీ శాఖ అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తునికాకు కార్మికులకు కాంట్రాక్టర్ ఇవ్వవలసిన డబ్బులు ఇచ్చినప్పటికీ, అటవీ శాఖ వారు ఇవ్వవలసిన డబ్బులు ఇవ్వకుండా తాత్సరం చేస్తూ ఆదివాసీల శ్రమను దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు తునికాకు కార్మికులకు పూర్తి పేమెంట్స్ తక్షణమే చెల్లించాలని, లేకుంటే డిఎఫ్ఒ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిడగయ్య వెంకయ్య, ముత్తయ్య, రమేష్, భద్రయ్య, ఎర్రయ్య, కార్మికులు పాల్గొన్నారు.

పిడుగు పాటుకు వ్యక్తి మృతి

సంఘటనా స్థలంలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ అప్పలరాజు

ప్రజాశక్తి-అడ్డతీగల

పిడుగు పాటుకు గురై వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని ఎల్లవరం పంచాయతీ బొంగరాలు పాడు గ్రామంలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... బొంగరాలు పాడు గ్రామానికి చెందిన నర్సి అప్పారావు సోమవారం సాయంత్రం తన పొలంలోకి వెళ్లి పని చేసుకుంటున్న సమయంలో వర్షం ప్రారంభమైంది. దీంతో ఆయన చెట్టు కిందకు వెళ్లారు. ఈ సమయంలో పిడుగు పడటంతో అక్కడే మృతి చెందాడు. సోమవారం రాత్రంతా ఇంటికి రాకపోవడంతో మంగళవారం ఉదయం కుటుంబ సభ్యులు వెతుక్కుంటూ పొలంలోకి వెళ్ళగా అప్పారావు మృతి చెంది ఉండడంతో బోరున విలపించారు. ఈ సమాచారాన్ని గ్రామస్తులు మండల స్థాయి అధికారులకు, పోలీసులకు తెలియజేశారు. ఎస్సై అప్పలరాజు, వీఆర్వో మురళీకృష్ణ సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని అడ్డతీగల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. దీనిపై కేసు నమోదు చేసి పూర్తి వివరాలు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అప్పలరాజు తెలిపారు. మృతుడు అప్పారావుకు భార్య చిన్ని, కుమార్తె, కుమారుడు ఉన్నట్లు బంధువులు చెప్పారు.

నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే లక్ష్యంతో పని చేయనున్నట్లు స్థానిక గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యం అన్నారు. పాఠశాల ప్రిన్సిపల్‌గా మంగళవారం సుబ్రహ్మణ్యం నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన అన్నమయ్య జిల్లా రాయచోటి గురుకుల పాఠశాల నుండి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ పని చేసిన ప్రిన్సిపల్ సత్యవేణి మారేడుమిల్లికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా మంగళవారం ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడంతోపాటు, క్రమశిక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యం

మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి చిన్నబాబు

పోలవరం పోరు కేక పాదయాత్రను జయప్రదం చేయండి

- సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు

ప్రజాశక్తి- విఆర్.పురం

పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి సిపిఎం ఆధ్వర్యాన ఈ నెల 20 నుంచి చేపట్టనున్న పోలవరం పోరుకేక పాదయాత్రను జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు పిలుపునిచ్చారు. మండలంలోని నాగేంద్రపురంలో రవ్వ సోమరాజు అధ్యక్షతన మంగళవారం పాదయాత్ర సన్నాహక సమావేశం జరిగింది. పాదయాత్రలో తాము భాగస్వాములవుతామని గ్రామస్తులు తెలిపారు. అలాగే పాదయాత్రి నిర్వహణకు ఆర్థిక సాయం అందిస్తామన్నారు. ఈ సందర్భంగా చిన్నబాబు మాట్లాడుతూ పోలవరం నిర్వాసితుల పునరావాసం పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. నిర్వాసితులకు పూర్తి స్థాయిలో పునరావాసం, ప్యాకేజీ కల్పించిన తరువాత పోలవరం నిర్మాణం చేయాల్సి ఉండగా, అందుకు విరుద్ధంగా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయన్నారు. దీని వల్ల వరదల సమయంలో నిర్వాసిత గ్రామాలు ముంపునకు గురై ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో పోలవరం నిర్వాసితుల సమస్యలను ఎజెండా చేసే ఉద్దేశంతో ఈ పాదయాత్ర చేపట్టినట్లు చెప్పారు. ఇందులో నిర్వాసితులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు పంకు సత్తిబాబు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

తహశీల్దారును నిలదీసిన నిర్వాసితులు

మంజూరైన పట్టాలు నిరాకరణపై మండిపాటు

ప్రజాశక్తి-విఆర్.పురం

పోలవరం నిర్వాసితులకు మంజూరైన ఇళ్ల పట్టాలు ఇవ్వడానికి నిరాకరించడంపై తహశీల్దారును మండలంలోని శ్రీరామగిరి సర్పంచ్ పులి సంతోష్‌కుమార్, బాధిత నిర్వాసితులు నిలదీశారు. మంగళవారం ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమానికి తహశీల్దారు వచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్, నిర్వాసితులు మాట్లాడుతూ అన్ని సర్వేలు పూర్తయి, గతంలో ఇళ్ల ప్యాకేజీ కూడా అందుకున్న నిర్వాసితులకు ఇచ్చే ఇళ్ల పట్టాలు ఇవ్వడంలో తహశీల్దారు నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇళ్ళపట్టాలు మంజూరైనప్పటికీ కొత్త పట్టాలు ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. ఈ విషయమై అవసరమైతే కోర్టుకు వెళ్తామని హెచ్చరించారు. నిర్వాసితులై చనిపోయిన కుటుంబాల వారికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వలేదని, అది చాలదన్నట్లు ఇప్పుడు వారి ఇళ్లకు పట్టాలు కూడా ఇవ్వకుండా అనేక సాకులు చూపడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికైనా అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ స్పందించి వెంటనే మంజూరైన ఆర్ అండ్ ఆర్ ఇళ్ల కాలనీల పట్టాలను అన్ని కుటుంబాలకు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

గిరిజన యువకుడు తీసిన లఘు చిత్రానికి రెండు అవార్డులు

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలోని కొమ్మిక గ్రామానికి చెందిన గిరిజన యువకుడు ఎన్.వెంకట్ రాఘవ తీసిన లఘు చిత్రానికి రెండు అవార్డులు లభించాయి. వెంకట్ రాఘవ 'మీ చూపులే' అనే లఘు చిత్రంలో కథానాయకుడిగా నటిస్తూ దర్శకత్వం వహించారు. ఈ చిత్రం రోష్నీ ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్లో ఉత్తమ దర్శకుడు, ఉత్తమ నటుడు విభాగాల్లో రెండు అవార్డులు గెలుచుకుంది. ఇటీవల జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో వీటిని అందుకున్నారు. ఈ అవార్డులు రావడం పట్ల వెంకట్ రాఘవకు మండలంలో పలువురు అభినందనలు తెలిపారు.

'మీ చూపులే' లఘు చిత్రం పోస్టర్

ఆయుర్వేద వైద్యులు జమాల్‌ఖాన్‌కు సన్మానం

ప్రజాశక్తి- ఎటపాక

ఎటపాక గ్రామంలో ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు డాక్టర్ జమాల్ ఖాన్‌ను తిరువూరు నియోజకవర్గం, గంపలగూడెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ యనమద్ది నాగ మల్లేశ్వరరావు కుటుంబ సభ్యులు మంగళవారం ఆసుపత్రికి వచ్చి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాగ మల్లేశ్వరరావు మాట్లాడుతూ రెండేళ్లుగా తమ తండ్రి అనారోగ్యంతో బాధపడుతున్నారని, అనేక ఆసుపత్రులకు తిరిగినా రోగం నయం కాకపోవడంతో ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్ వైద్య శిబిరానికి వచ్చి పరీక్షలు నిర్వహించి మందులు వాడిన తర్వాత జబ్బు నయమైందని తెలిపారు. అందుకు కృతజ్ఞతగా జమాల్‌ఖాన్‌ను సన్మానించినట్లు చెప్పారు. లక్షల రూపాయలు వెచ్చించినా తగ్గని రోగాలు ఆయుర్వేదంతో తగ్గాయని, జమాల్ ఖాన్ సేవలు ఈ సమాజానికి మరింత అవసరమని వారు తెలిపారు.

జమాల్ ఖాన్‌ను సన్మానిస్తున్న మాజీ సర్పంచ్ నాగమల్లేశ్వరరావు కుటుంబ సభ్యులు

గ్రామస్తులతో మాట్లాడుతున్న జెడ్‌పిటిసి సభ్యులు మత్స్యలింగం

సమస్యలపై జెడ్‌పిటిసి ఆరా

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోని అండిబ పంచాయతీ అడపరాయి, బంగారుబుడె, భీమవరం పంచాయతీ రామచంద్రపురం, రంగశీల పంచాయతీ ఇరుకువలస తదితర గ్రామాలను జెడ్‌పిటిసి రేగం మత్స్యలింగం మంగళవారం సందర్శించారు. మండలంలోని మారుమూల పంచాయతీల్లో మౌలిక సదుపాయాలు తదితర అభివృద్ధి పనులపై పలు రైతుల అడిగి తెలుసుకున్నారు. అనంతరం జెడ్‌పిటిసి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పలు సమస్యలను జెడ్‌పిటిసి దృష్టికి ఆయా గ్రామాల ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, స్థానికులు తెచ్చారు. గిరిజన గ్రామాల్లో దేవాలయ నిర్మాణాలకు సంబంధిత దేవాదాయశాఖ దీనిపై ఫైల్‌పైనే మాట్లాడి నిధులు మంజూరు చేయించాలన్నారు. ఒక్కో గ్రామానికి దేవాలయం నిర్మాణానికి రూ.10లక్షలు మంజూరు చేస్తారని, ఈమేరకు దేవాలయ నిర్మాణానికి స్థలపరిశీలనపై చర్చించారు.కార్యక్రమంలో కొర్ర మొద్దు, గెమ్మెలి అప్పారావు, చంటి, వెంకట్, ఈశ్వరరావు పాల్గొన్నారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి పాడేరు: ప్రపంచ రక్త దాతల దినోత్సవం ఈసందర్భంగా ఈనెల 14న బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ రక్తదాన శిబిరానికి దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పిలుపునిచ్చారు.ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం పాడేరు, రాష్ట్ర ప్రాణదాత సేవ పురస్కార్ అవార్డు గ్రహీత గజేష్ కొమ్మెర సహకారంతో ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రస్తుత వేసవి కాలంలో రక్తనిధి కేంద్రాలలో రక్తం కొరత ఉండని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ కృష్ణారావు తెలిపిన మేరకు, కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటిడిఏ పిఒ వి అభిషేక్ రక్తదాన శిబిరం నిర్వహణకు ఆదేశించారు. రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకు సౌజన్యంతో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 3గంటల వరకు నిర్వహించే మెగా రక్తదాన శిబిరంలో ప్రజలందరు, యువకులు, రక్తదాతలు, స్వచ్ఛంద సంస్థలు , ప్రభుత్వ అధికారులు పాల్గొని, రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని. నిర్వాహకులు పిలుపునిచ్చారు. రక్తదాన శిబిరానికి వచ్చే దాతలు రెడ్ క్రాస్ ప్రతినిధులు లోహితాస్, రాజబాబు, జయలక్ష్మి, సూర్యారావు, గౌరీ శంకర్ ఫోన్‌నెంబర్లు 82973 47754, 6303 499 360, 83329 64373, 94413 34001 సంప్రదించాలని సూచించారు.

ఘనంగా రామునాయుడు వర్ధంతి

ప్రజాశక్తి- ములగాడ : ప్రజల మనిషి, సిపిఎం మల్కాపురం జోన్ నాయకులు కీర్తిశేషులు ధర్మిరెడ్డి రామునాయుడు రెండో వర్ధంతిని 62వ వార్డు పరిధి దుర్గానగర్ గ్రౌండ్ ఆవరణలో నిర్వహించారు. సిపిఎం మల్కాపురంజోన్ నాయకులు కె.పెంటారావు అధ్యక్షతన జరిగిన సభలో పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి మరడాన జగ్గునాయుడు, 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు రామునాయుడు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ, రాముునాయుడు సిపిఎం ఆశయాలకు కట్టుబడి పనిచేసి ప్రజలమనిషిగా గుర్తింపు పొందారన్నారు. వారి కుటుంబానికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ, రామునాయుడు ధన్యజీవి అన్నారు. దుర్గానగర్ గ్రామ అధ్యక్షులుగా పదేళ్లపాటు ప్రజలకు ఏనలేని సేవలందించారని, ఇల్లు లేని పేదలకోసం పోరాడి జైలు జీవితం అనుభవించారని తెలిపారు. ఇళ్ల పట్టాలు, రేషన్ కార్డులు, విద్యుత్, రోడ్ల సమస్యపై నిరంతరం పనిచేశారని గుర్తుచేశారు. అవినీతికి తావులేకుండా, నిస్వార్థంగా పనిచేయడంతో ప్రజల మనస్సులో ధన్యజీవిగా నిలిచారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా రామునాయుడు స్ఫూర్తితో పోరాడాలని పిలుపునిచ్చారు.

ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి

ప్రజాశక్తి-పాడేరు టౌన్: మండలకేంద్రం, వేడిగాలులకు ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు పరిధిలోకొన్ని రోజులుగా భానుడు ఉగ్రరూపం కొనసాగుతుండడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. మంగళవారం పాడేరు పట్టణంలోని ప్రధాన రహదారులతోపాటు పాడేరు నుంచి అరకు, చోడవరం ప్రధాన రహదారులపై జనాలు లేక వెలవెలబోయాయి. పట్టణంలో ఉదయం 8 గంటలకే భానుడు భగభగ మండుతుండడంతో బయటకు రావాలంటే భయపడుతున్నారు. సాయంత్రం ఆరు గంటలు దాటినా వేడి తగ్గడం లేదు. ఎండ వేడిమి ఉండడంతో బయటకు రావాలంటే భయపడి ఇళ్లకే పరిమితమవుతున్నారు.

మండుటెండవేళ అత్యవసరం అయితే తప్ప బయటకు రావడం లేదు. ఎండ నుంచి రక్షణ పొందేందుకు గొడుగులు, తువ్వాళ్లను ఉపయోగించుకున్నారు. ఊహించని రీతిలో ఎండ తీవ్రత ఉండడంతో ఉక్కపోతతో జనం విలవిల్లాడుతున్నారు. ఈ ఎండకు తగిన రక్షణ లేకుండా బయట తిరిగితే వడదెబ్బ తగిలే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

పాడేరులో నిర్మానుష్యంగా ఉన్న రహదారి

జెడ్‌పిటిసి చొరవతో భూసమస్యకు పరిష్కారం

కె లైన్ విస్తరణలో నష్టపోయిన భూముల సర్వే నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి-అనంతగిరి : కొత్తవలస, కిరండోల్ కేకే లైన్‌లో రైలు రెండవ రోడ్డు పనుల విస్తరణలో భూములు నష్టపోతున్న అనంతగిరి మండలం ఎగువశోభ పంచాయతీ పొర్లుపోదర్ గ్రామ రైతుల సమస్య జెడ్‌పిటిసి దీసరి గంగరాజు చొరవతో పరిష్కారమైంది. గిరిజనుల జిరాయితీ భూముల్లో మట్టి వేసే విషయమై రేగిన వివాదంపై నిర్వాసిత రైతులు సిపిఎం జెడ్‌పిటిసి దీసరి గంగరాజుతో కలిసి అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రెవెన్యూ, రైల్వే ఉమ్మడి అధికారులు ఉమ్మడి పరిశీలన జరిపి, ఆయా భూములను రైతుల జిరాయితీగా తేల్చడంతో బాధిత గిరిజనులు ఊపిరిపీల్చుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం జెడ్‌పిటిసి దీసరి గంగరాజు మాట్లాడుతూ, ఎగువశోభ పంచాయతీ పొర్లుపోదర్ గ్రామానికి చెందిన సొంటరి భీమన్న సర్వే నెంబర్ 21లో 11.32 ఎకరాలు, సాగర సన్యాసికి సర్వే నెంబర్ 20లో 8.57 ఎకరాల భూమిలో కేకే లైన్ విస్తరణలో మిగిలిన మట్టి వేయడంతో భూమి నష్టపోయే పరిస్థితి ఉందన్నారు. దీనిపై రైతులు అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ, రైల్వే అధికారులు ససేమిరా అనడంతో ఆందోళన చెందిన రైతులు సిపిఎం ఆధ్వర్యంలోరెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారన్నారు. ఉమ్మడి పరిశీలనలో రైల్వే అటవీ, ప్రభుత్వ భూములు కావని, రైతుల జిరాయితీ భూములని నిర్ధారణ అయిందని గంగరాజు తెలిపారు.దీంతో రైల్వే అధికారులు, కాంట్రాక్టర్లు వెనుదిరిగారన్నారు. అయితే ఇప్పటివరకు రైతులకు జరిగిన భూనష్టంపై సంబంధిత అధికారులు స్పందించి తగు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టోకూరు సర్పంచ్ కిల్లో. మొస్య, ఎగువశోభ సర్పంచ్ కొర్రా సింహాద్రి, సిపిఎం నాయకులు గెమ్మెల దేవన్న, వార్డు మెంబర్ పూజారి. లక్ష్మణ్, .పాంగి. రవీంద్ర, సాగర సన్యాసి, రెవెన్యూ సర్వేయర్. దేవదాను, ఈశ్వర్రావు, .సునీల్, రైల్వే శాఖ డివిజనల్ ఇంజనీర్ అధికారి వెంకటరాజు, కాంట్రాక్టర్ల కిశోర్, వెంకటేష్, రైతులు పాల్గొన్నారు

అంగన్వాడీలకు గోళీకాయంత గుడ్లు!

ప్రజాశక్తి పాడేరు : గోళీకాయంత గుడ్డుతో పిల్లలు, గర్భిణులు, బాలింతలకు ఏ మేరకు పౌష్టికాహారం అందుతుందో ప్రభుత్వం, అధికారులు చెప్పాలని ఎపి గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కె.రాధాకృష్ణ కోరారు. కాంట్రాక్టు, టెండరింగ్‌లతో పాడేరు ఏజెన్సీలోని అంగన్వాడీ కేంద్రాలకు కోడి గుడ్ల సరఫరాలో జరుగుతున్న అక్రమాలను, దోపిడిని అరికట్టాలని డిమాండ్ చేశారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ అంగన్వాడీలకు సరఫరా చేస్తున్న గుడ్డు సైజు మరీ తీసికట్టుగా ఉన్నాయని, తొక్కతో కలుపుకుంటే 35గ్రాముల బరువైనా ఉండడం లేదన్నారు. అంగన్వాడీల కోసమే పెట్టించారా అన్నట్లున్న ఇంత చిన్నసైజు గుడ్లు ఇస్తున్నా, సంబంధిత ఐసిడిఎస్ అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. అంగన్వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు అభ్యంతరం చెబుతున్నప్పటికీ, టెండర్‌దారులు బలవంతంగా గుడ్లు అప్పగించి వెళ్ళిపోతున్నారన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార సరఫరాలో జరుగుతున్న అవకతవకలపై అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో కాంట్రాక్ట్ కార్మికుడు మృతి

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ సింటర్ ప్లాంట్‌లో వెల్డింగ్ పనులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై కాంట్రాక్టు కార్మికుడు మృతి చెందాడు. పెదగంట్యాడ మండలం సిద్దేశ్వరం గ్రామానికి చెందిన గోందేశి రాజు (32) సింటర్‌ప్లాంట్‌లో రమణరాజు కాంట్రాక్టర్ వద్ద పనిచేస్తున్నాడు. మంగళవారం సాయంత్రం సింటర్‌ప్లాంట్‌లో విధులు నిర్వహిస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. తోటి ఉద్యోగులు వెంటనే కోకోఒవేన్ వద్ద ఉన్న ఫస్ట్ ఎయిడ్ సెంటర్ వద్దకు తరలించారు. చికిత్సకు స్పందించకపోవడంతో మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కార్మికుని మృతిపై ఉక్కునగరం పోలీసులకు, మృతుని కుటుంబ సభ్యులకు అధికారులు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మతదేహాన్ని కెజిహెచ్‌కు తరలించారు. మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు కాంట్రాక్టర్‌తో చర్చలు జరుగుతున్నాయి.

మిస్సింగ్ కేసు ఛేదించిన పోలీసులు

ప్రజాశక్తి -గోపాలపట్నం : మిస్సింగ్ కేసును పోలీసులు ఛేదించారు. దీనికి సంబంధించి గోపాలపట్నం పోలీసుల కథనం ప్రకారం... పాడి మేఘన తన కుటుంబ సభ్యులతో కలిసి సింహాచలం దరి గోసాల వద్ద నివాసముంటున్నారు. ఈమె పదవ తరగతి వరకు చదివింది. తల్లి రామలక్ష్మి ఓ ఆసుపత్రిలో అటెండర్‌గా పనిచేస్తున్నారు. ఆమె విధులకు వెళ్లిన తర్వాత, సోదరులు నిద్రిస్తున్న సమయంలో మేఘన ఇంట్లో నుంచి బయటికి వెళ్లిపోయారు. ఈ ఘటనపై తల్లి ఫిర్యాదుచేయడంతో గోపాలపట్నం పోలీసులు మిస్సింగ్ కేసుగా నమోదు చేశారు. మేఘన సెల్‌ఫోన్ లొకేషన్ ఆధారంగా చోడవరంలో ఉన్నట్లు గుర్తించారు. అక్కడికి పోలీసులు పంపించి ఆమెను పట్టుకున్నారు.

ఆటో ప్రమాదంలో గాయాలపాలైన ప్రయాణికులు

కొండను ఢీకొన్న ఆటో : పలువురికి గాయాలు

- ఒకరి పరిస్థితి విషమం, విశాఖ కెజిహెచ్‌కు తరలింపు

ప్రజాశక్తి -అనంతగిరి : అనంతగిరి ఘాట్ రోడ్ శివలింగపురం ఒకటో నెంబర్ మలుపు సమీపం తోటవలస గ్రామం వద్ద ఆటో అదుపుతప్పి కొండను ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలు కాగా పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. మంగళవారం అరకు నుంచి భీంపోలులో శుభకార్యానికి వెళుతుండగా ప్రమాదం చోటుచేసుకుంది. ఆటోలో ప్రయాణిస్తున్న బురిడి భీమన్నకు తీవ్రగాయాలయ్యాయి. సూకూరు రాధమ్మ, గెమ్మెల తులసి, జి.సుమిత్ర, జి.హరిబాబుతో పాటు ముగ్గురు చిన్నారులకు స్వల్ప గాయాలయ్యాయి. తీవ్ర గాయాలైన భీమన్నను అంబులెన్స్ ద్వారా ఎస్.కోట ఆసుపత్రికి తరలించగా, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విశాఖ కెజిహెచ్‌కు రిఫర్ చేశారు. స్వల్పగాయాలైన వారికి ప్రథమ చికిత్స అందించారు.

స్టీల్‌ప్లాంట్‌లో బొప్పాయి పెంపకం

ప్రజాశక్తి-ఉక్కునగరం : టౌన్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ అగ్రో-ఫారెస్ట్రీ విభాగం ఆధ్వర్యాన ఉక్కునగరంలోని ఎకరం భూమిలో 1000 బొప్పాయి మొక్కలను నాటే కార్యక్రమాన్ని హెచ్‌ఆర్ సిజిఎం జి.గాంధీ ప్రారంభించారు. ఆదాయ ఉత్పత్తికి, పచ్చదనాన్ని కాపాడుతూ ఖాళీగా ఉన్న భూమిని సద్వినియోగం చేసుకున్నందుకు అగ్రో-ఫారెస్ట్రీ విభాగ సభ్యులను సిజిఎం ప్రత్యేకంగా అభినందించారు. థాయ్ రకం బొప్పాయి 4-5 నెలల తర్వాత పండ్లు కాస్తాయని తెలిపారు.

కిట్లు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

విద్యా కానుక కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - సీలేరుయ : జీకే వీధి మండలం, సీలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్లను ఎంపిటీసీ పిల్ల సాంబమూర్తి, ఇన్‌ఛార్జి సర్పంచ్ కె.వల్లి ప్రసాదు, స్కూల్ కమిటీ చైర్మన్ నీతు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జగ్గారావు మాట్లాడుతూ ప్రభుత్వం అందజేసిన జగనన్న విద్యా కానుక కిట్లను ప్రతి ఒక్క విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి కార్యకర్తలు స్వర్ణలత, బలరాం, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - రాజవొమ్మంగి : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి విద్యార్థుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ ఆర్.శిరీష తెలిపారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ప్రిన్సిపల్ శిరీష మంగళవారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ, పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు తమ కళాశాలలో బైపిసి, ఎంపీసీ, హెచ్ఇసి, సిఇసి గ్రూపులలో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఎంపీసీ బైపీసీ గ్రూపులలో ఇంగ్లీషు, తెలుగు మీడియంలో బోధన జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థినీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

109 మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి - కొయ్యూరు : మండలంలోని డౌనూరు గ్రామంలో 109 మద్యం సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకొని, నిందితుడిని అరెస్టు చేశారు. ఎస్ఐ రాజారావు కథనం ప్రకారం... ముందస్తు సమాచారంతో పోలీసులు డౌనూరు గ్రామంలోని సురేష్ పట్నాయక్ అనే వ్యక్తి ఇంట్లో సోదాలు చేశారు. ఆయన ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 109 మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయి. ఈ మేరకు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, సురేష్ పట్నాయక్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ రాజారావు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలి

ప్రజాశక్తి - కొయ్యూరు

గ్రామ పంచాయతీల అభివృద్ధికి కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది కృషి చేయాలని ఎంపిడిఒ లాలం సీతయ్య అన్నారు. కొయ్యూరు నూతన ఎంపిడిఒగా సీతయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మంగళవారం మండలంలోని పలు పంచాయతీల కార్యదర్శులు, గ్రామ సచివాలయ కార్యదర్శులు ఎంపీడీవోను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ వారితో మాట్లాడారు.

ఎంపిడిఒ సీతయ్య

పారిశుధ్య కార్మికుల సమ్మెకు మద్దతు ఇవ్వండి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పారిశుధ్య కార్మికుల న్యాయమైన డిమాండ్లను జివిఎంసి యాజమాన్యం మినిట్స్‌లో అంగీకరించి అమలు చేయని కారణంగా ఈ నెల 19 నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తున్నామని, అందుకు మద్దతునివ్వాలని కోరుతూ గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు విశాఖ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబును ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే స్పందిస్తూ ఈ నెల 18లోగా సమస్యలను పాలకవర్గం పరిష్కరించాలన్నారు

నేటితో నిషేధం సరి

చేపల వేటకు సిద్ధమవుతున్న మత్స్యకారులు
అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

నేటి అర్ధరాత్రి నుంచి సముద్రంలో చేపల వేటకు మత్స్యకారులు సిద్ధమవుతున్నారు. ఏప్రిల్ 15 నుంచి సముద్రంలో చేపల వేటకువున్న నిషేధం జూన్ 14 అర్ధరాత్రితో ముగియనుంది. దీంతో అర్ధరాత్రి నుంచి చేపల వేటకు వెళ్లేందుకు బోట్లు, వలలను మత్స్యకారులు సిద్ధం చేస్తున్నారు. జిల్లాలో నక్కపల్లి, ఎస్.రాయవరం, యలమంచిలి, రాంబిల్లి, అచ్యుతాపురం, పరవాడ మండలాల్లో 73 కిలోమీటర్ల తీర ప్రాంతంలో 20 వేల మంది మత్స్యకారులున్నారు. వీరిలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 18 వేల మంది చేపల వేటపై ఆధారపడి బతుకుతున్నారు. 2085 మోటారు బోట్లున్నాయి. వేటకు వెళ్లే బోట్లకు రాయితీపై డీజిల్ సరఫరా చేసేందుకు ఈ నెల 17 నుంచి మత్స్యకారులకు స్మార్ట్ కార్డులు ఇవ్వనున్నారు.

వేట నిషేధ కాలంలో 11,116 మందిని మత్స్యకార భరోసాకు అర్హులుగా మత్స్యశాఖాధికారులు గుర్తించారు. వీరిలో 10,750 మందికి ఒక్కొక్కరికీ పది వేలు రూపాయలు చొప్పున బ్యాంకు ఖాతాల్లో జమైంది. మిగిలిన 366 మందికి వివిధ సాంకేతిక కారణాల వల్ల భరోసా జమకాలేదు. ప్రధానంగా ఆధార్‌కు ఫోన్ నెంబరు లింక్‌కాకపోవడం, ఇకెవైసి చేయించుకోకపోవడం, అకౌంట్ నెంబరు ప్రస్తుతం పనిచేయకపోవడం, ఆధార్ మ్యాపింగ్ చేయకపోవడం వంటి కారణాలు వల్ల వీరికి డబ్బులు పడలేదు. భరోసా జమకాకపోవడానికి అడ్డంకిగా మారిన సమస్యలను గ్రామ సచివాలయంలో ఫిషరీష్ అసిస్టెంట్‌ను సంప్రదించి పరిష్కరించుకోగలిగితే వారికి కూడా డబ్బులు జమకానున్నాయి. గతేడాది 10,280 మందికి మత్స్యకార భరోసా లభించగా, ఈ ఏడాది భరోసాకు అర్హులను గుర్తించే పని మార్చి నుంచి చేపట్టడంతో సకాలంలో అర్హుల జాబితాను మత్స్యశాఖాధికారులు తయారుచేశారు. 110 బోట్లలో వలసవెళ్లిన మత్స్యకారులు నష్టపోకుండా వారి వివరాలు సేకరించి జాబితాను తయారుచేయడంతో గతేడాది కంటే ఈ ఏడాది అదనంగా 831 మందికి మత్స్యకార భరోసా అందింది. అర్హతలుండీ భరోసా అందని మత్స్యకారుల ఫిషరీస్ అసిస్టెంట్‌ను కలిసి వివరాలు నమోదు చేయించుకుంటే వారికి కూడా భరోసా అందనుందని అధికారులు చెబుతున్నారు.

వేటకు సిద్ధంగా ఉన్న బోట్లు

మత్స్యకారులు అప్రమత్తంగా వుండాలి

రాబోయే సీజన్‌లో తుపాను, ప్రకృతి వైపరీత్యాలు ఎక్కువగా వుండే అవకాశమున్నందున సముద్రంలో వేటకు వెళ్లే మత్స్యకారులు చాలా అప్రమత్తంగా వుండాలి. వేట సమయంలో లైఫ్ జాకెట్లు, లైఫ్ బాయ్స్ ధరించాలి. జిపిఎస్ పరికరాలు పెట్టుకోవాలి. తుపాను సమాచారం తెలిసినప్పుడు సముద్రం లోపలకు వెళ్లకూడదు. వేటకు వెళ్లే మత్స్కకారులు తమ ఫోన్ నెంబర్లు, జిపిఎస్ కో - ఆర్డినేట్లు ఇవ్వాలి. మత్స్యకార భరోసా రాని మత్స్యకారులు సచివాలయంలోవున్న ఫిషరీస్ అసిస్టెంట్ దగ్గరకు వెళ్లి సాంకేతిక సమస్యలను పరిష్కరించుకోవాలి.

- పి.లక్ష్మణరావు, జిల్లా మత్స్యశాఖాధికారి

ముగిసిన ఉపాధ్యాయ బదిలీలు

మైదాన పోస్టులు బ్లాక్ చేయడంతో అత్యధిక మంది ఏజెన్సీకి..
ఆందోళన చెందుతున్న మహిళా ఉపాధ్యాయులు

ప్రజాశక్తి- అనకాపల్లి ప్రతినిధి

ఉమ్మడి విశాఖపట్నంలో రెండ్రోజులు ఆలస్యంగా సాగిన ఉపాధ్యాయ బదిలీలు మంగళవారంతో ముగిశాయి. జిఒ 117తో వందలాది పోస్టులు రద్దుకావడం, ఏజెన్సీలో జిఒ 3 అమల్లో లేకపోవడం, మైదాన ప్రాంతంలో ఖాళీ పోస్టులు చూపించకపోవడంతో కేటగిరీ వన్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఏజెన్సీ ప్రాంతానికి వెళ్లాల్సివచ్చింది. ఎస్‌జిటి బదిలీలు మంగళవారం ఉదయం జరగడంతో వారంతా పనిచేసిన చోట రిలీవ్ అయి బుధవారం నుంచి కేటాయించిన పాఠశాలల్లో రిపోర్ట్ చేయాలని విద్యాశాఖాధికారులు చెబుతున్నారు. బదిలీ ప్రక్రియ ఆదివారం నాటికి పూర్తిచేసి పాఠశాలలు పున:ప్రారంభం నాటికి వారంతా ఆయా పాఠశాలల్లో జాయిన్‌కావాల్సివుంది. కానీ బదిలీల్లో రెండ్రోజులు జాప్యం చోటుచేసుకుంది. బదిలీపై ఏజెన్సీ వెళ్తున్న ఉపాధ్యాయుల్లో మహిళా ఉపాధ్యాయులు ఎక్కువ మంది వున్నారు. గతంలో జిఒ 3 ఏజెన్సీలో అమల్లో ఉండడంతో నగరం, మైదాన ప్రాంత పరిధిలో ఉపాధ్యాయ బదిలీలు జరిగేవి. ప్రభుత్వ విధానాలు వల్ల ఆ వెసులుబాటులన్నీ పోయి, కొత్త సమస్యలు ముందుకొచ్చాయి. మైదాన ప్రాంతంలో ఖాళీలను బ్లాక్ చేయడంతో నగర ప్రాంతంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు అనివార్యంగా బదిలీపై ఏజెన్సీ ప్రాంతంలోని మారుమూల ప్రాంతాలకు వెళ్లాల్సివస్తోంది. బదిలీ అయిన ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు, హిందీ, తెలుగు పండిట్‌లు, పిఇటిలు బదిలీ అయిన పాఠశాలల్లో జాయినయ్యారని విశాఖపట్నం జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ తెలిపారు. ఎస్‌జిటిలు బుధవారం నుంచి జాయినవుతారని తెలిపారు.

ఆశ్రితను అభినందిస్తున్న అతిథులు

సివిల్స్ విజేతలు ఉత్తమ సేవలందించాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సివిల్ సర్వీసెస్‌కు ఎంపికైన వారు విధుల్లో చేరాక చిరస్థాయిగా నిలిచేలా సేవ చేయాలని లయన్స్ బ్లడ్ బ్యాంకు కార్యదర్శి ఎన్.దుర్గాప్రసాద్ కోరారు. యుపిఎస్‌సి సివిల్ సర్వీసెస్ ఫలితాల్లో 315వ ర్యాంకు పొందిన విశాఖపట్నం జిల్లాకు చెందిన ఎన్.ఆశ్రితకు మంగళవారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విజేతకు అభినందనలు తెలిపారు. అభ్యర్థులు ఉద్యోగాలు పొందిన తరువాత మూలాలు మరిచిపోరాదని, ప్రజలతో మమేకమై ఉండాలని కోరారు. కొన్ని వేల జీవితాలను ప్రభావితం చేస్తారుగనుక బాధ్యతగా వ్యవహరించాలన్నారు. కొత్తగా సివిల్ సర్వీసెస్‌కు సన్నద్ధమయ్యేవారు సామాజిక స్పృహ కలిగి ఉండాలన్నారు. సంకల్పిస్తే మనిషి సాధించలేనిది ఏమీ లేదని, విశ్వాసంతో అడుగు వేయాలని అన్నారు. విజయం అంటే ఎక్కడి నుంచో రాదని ఎవరికివారు తమ జీవితాన్ని ఉన్నతంగా సఫలీకృతం చేసుకోవడమే నిజమైన విజయమని పేర్కొన్నారు. విశాఖ పౌర గ్రంథాలయ కార్యదర్శి డిఎస్.వర్మ మాట్లాడుతూ లక్షలాది మంది దరఖాస్తు చేసుకునే పరీక్షల్లో కేవలం వందల్లో మాత్రమే ఎంపిక ఉంటుందని, అన్నింటినీ దాటుకుని ముందుకు సాగాలంటే మేధస్సుతో పాటు మనోబలం కూడా అవసరమని అన్నారు. యువత టెక్నాలజీని సరైన మార్గంలో వినియోగించుకోవాలని కోరారు.

పలు రైళ్లు రద్దు, దారి మళ్లింపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దక్షిణ మధ్య రైల్వేలోని విజయవాడ డివిజన్‌లో రైల్వే మౌలిక సదుపాయాల పనుల కారణంగా పలు రైళ్లను రద్దు చేస్తున్నామని, మరికొన్ని రైళ్లు దారి మళ్లించిన మార్గంలో నడుస్తాయని రైల్వే శాఖ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎకె.త్రిపాఠి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు 07467/07466 విశాఖపట్నం -రాజమండ్రి - విశాఖపట్నం ప్యాసింజర్ ప్రత్యేక రైళ్ళు, 17267/17268 కాకినాడ-విశాఖపట్నం - కాకినాడ ఎక్స్‌ప్రెస్ రైళ్లను జూన్ 12 నుంచి 18 వరకు రద్దు చేశారు. అలాగే 17240 విశాఖపట్నం - గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ జూన్ 14, 17, 18 తేదీల్లోనూ, 13351 ధన్‌బాద్-అలెప్పీ బొకారో ఎక్స్‌ప్రెస్ జూన్ 13, 16, 17 తేదీల్లోనూ, 12889 టాటా నగర్ - ఎస్ఎంవి బెంగళూరు ఎక్స్‌ప్రెస్ జూన్ 16, 18637 హటియా - ఎస్ఎంవి బెంగళూరు ఎక్స్‌ప్రెస్ జూన్ 17, 12835 హటియా- ఎస్ఎంవి బెంగళూరు ఎక్స్‌ప్రెస్ జూన్ 13న నిడదవోలు-భీమవరం టౌన్-గుడివాడ-విజయవాడ మీదుగా దారి మళ్లించిన మార్గంలో నడుస్తుంది.

ఖరగ్‌పూర్ డివిజన్‌లో కొనసాగుతున్న రైళ్ల రద్దు

ఈ నెల 3న జరిగిన కోరమండల్ ప్రమాదంలో దెబ్బతిన్న ఖరగ్‌పూర్ డివిజన్‌లో ఖరగ్‌పూర్-భద్రక్ సెక్షన్‌లోని బహనాగ బజార్ స్టేషన్‌లో ట్రాక్ నిర్వహణ పనుల కారణంగా మరొక 15 రైళ్లను రద్దు చేస్తున్నట్టు రైల్వే శాఖ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎకె.త్రిపాఠి తెలిపారు. జూన్ 14న 22854 విశాఖపట్నం-షాలిమార్ ఎక్స్‌ప్రెస్, 12773 షాలిమార్-సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్, 22849 షాలిమార్-సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్, 22831 హౌరా-శ్రీ ఎస్ ప్రశాంతి నిలయం ఎక్స్‌ప్రెస్, 12842 ఎంజిఆర్ చెన్నై సెంట్రల్-షాలిమార్ కోరమాండల్ ఎక్స్‌ప్రెస్, 22842 తాంబరం - సంత్రాగచ్చి ఎక్స్‌ప్రెస్, 12868 పుదుచ్చేరి - హౌరా వీక్లీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, జూన్ 15న 22888 ఎస్ఎంవి బెంగళూరు-హౌరా ఎక్స్‌ప్రెస్, 18045 షాలిమార్-హైదరాబాద్ ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, 22603 ఖరగ్‌పూర్-విల్లుపురం-ఎక్స్‌ప్రెస్, 22874 విశాఖపట్నం- దిబ్రూఘర్ దిఘా ఎక్స్‌ప్రెస్, 07047 దిబ్రూఘర్ - సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్, 22808 ఎంజిఆర్ చెన్నై సెంట్రల్ - హౌరా షాలిమార్ ఎక్స్‌ప్రెస్ జూన్ 16న 22850 సికింద్రాబాద్-షాలిమార్ ఎక్స్‌ప్రెస్, 22832 శ్రీ ఎస్ ప్రశాంతి నిలయం - హౌరా ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేస్తున్నామని తెలిపారు.